సాక్షి
పశ్చిమగోదావరి
సోమవారం । 22 । జనవరి । 2024



పోటెత్తిన భక్తులు

బుట్టాయగూడెం: కామవరం అటవీ ప్రాంతంలో కొలువైన గుబ్బల మంగమ్మ తల్లిని ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.



వీక్షకులకు కనువిందు

పాలకొల్లులో ఏర్పాటుచేసిన చిత్ర కళా ప్రదర్శన ఆకట్టుకుంది. పలు పెయింటింగ్‌లు, చిత్రాలు అబ్బురపరిచాయి.

8లో ▸



కొల్లేరు వారధి కల సాకారం

కొల్లేరు వారధి నిర్మాణాన్ని వైఎస్సార్ సీపీ పాలనలో సాకారం చేయడంతో కొల్లేరు ప్రజలు చిరకాల వాంఛ నెరవేరింది.

8లో ▸

న్యూస్‌రీల్

అంబేడ్కర్ విగ్రహంపై విషం కక్కుతారా..



సత్తెన్నగూడెంలో ఈనాడు, ఆంధ్రజ్యోతి పత్రికలను దహనం చేస్తున్న దళితులు

ద్వారకాతిరుమల: విజయవాడ నడిబొడ్డున బీఆర్ అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణపై విషం కక్కుతున్న ఎల్లో మీడియాపై దళితులు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అంబేడ్కర్ భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తే, దానిపై కూడా విషపు రాతలు రాయడం సిగ్గుచేటని ధ్వజమెత్తుతున్నారు. ఈ క్రమంలో ఆదివారం మండలంలోని సత్తెన్నగూడెంలో దళితులు ఈనాడు, ఆంధ్రజ్యోతి దినపత్రికలను దహనం చేసి నిరసన తెలిపారు. ప్రపంచంలోనే అతిపెద్ద అంబేడ్కర్ విగ్రహాన్ని విజయవాడలో ఏర్పాటుచేయడం ద్వారా సీఎం జగన్ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల ఆత్మగౌరవాన్ని పెంచారని దళిత నాయకుడు మానుకొండ సుబ్బారావు అన్నారు. రోజురోజుకూ జగన్‌కు పెరుగుతున్న ఆదరణ చూసి రామోజీరావు, రాధాకృష్ణ ఓర్వలేకపోతున్నారని, అందుకే చంద్రబాబు డైరెక్షన్‌లో ఈనాడు, ఆంధ్రజ్యోతి పత్రికల్లో విషపు రాతలు రాస్తున్నారని మండిపడ్డారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేసి పూలమాలలు వేశారు.

24న విద్యుత్ పరిష్కార వేదిక

తణుకు: తణుకు ఈపీడీసీఎల్ సబ్ డివిజన్ కార్యాలయంలో విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక ఈనెల 24న నిర్వహించనున్నట్టు తాడేపల్లిగూడెం డీఈ ఎస్.వెంకటేశ్వరరావు తెలిపారు. వినియోగదారుల ఫోరం చైర్మన్, రిటైర్డ్ న్యాయమూర్తి బి.సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించే వేదికలో సాంకేతిక సమస్యలపై బి.జనార్దనరావు, ఆర్థిక సంబంధ వ్యవహారాల పరిష్కారానికి డాక్టర్ ఆర్.సురేంద్రకుమార్ హాజరవుతారని చెప్పారు. వినియోగదారులు తమ విద్యుత్ సమస్యలతో పాటు సంస్థ నిర్వహణపై తగు సూచనలు అందించాలని కోరారు.

ఏపీయూడబ్ల్యూజే జిల్లా కార్యవర్గం ఎన్నిక

భీమవరం: ఏపీయూడబ్ల్యూజే పశ్చిమగోదావరి జిల్లా నూతన కార్యవర్గం ఆదివారం ఎన్నికైంది. అధ్యక్షుడిగా వాకల సత్య సాయిబాబా, కార్యదర్శిగా గజపతి వరప్రసాద్, కోశాధికారిగా ముత్యాల శ్రీనివాస్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా తులా భాస్కర్, ఉపాధ్యక్షులుగా కేఎస్ఆర్‌కే గోపాలకృష్ణ, జి.ఉదయ భాస్కరరావు, డి.కృష్ణమోహన్, జి.శ్రీనుబాబు, ఎస్.వెంకట లక్ష్మయ్య, సహాయ కార్యదర్శులుగా ఐదుగురు, కార్యవర్గ సభ్యులుగా 11 మందితో జిల్లా కమిటీ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షుడిగా జక్కంశెట్టి శ్రీనివాస్, కార్యదర్శిగా పులపర్తి నరసింహారావు, కోశాధికారిగా బీహెచ్ఎన్ వర్మ, ఇద్దరు ఉపాధ్యక్షులుగా, ఇద్దరు సహాయ కార్యదర్శులుగా, ఒక కార్యవర్గ సభ్యుడి నియామకం జరిగింది. చిన్న మధ్యతరగతి పత్రికల జిల్లా అధ్యక్షుడిగా కాగిత సూర్యనారాయణ, కార్యదర్శిగా ఏడుకొండలను ఎన్నుకున్నట్టు ఎన్నిక నిర్వాహకులు పేర్కొన్నారు. నూతన కమిటీని పలువురు అభినందించారు.

అంగన్‌వాడీలకు అనుమతి లేదు



డి.మేరీ ప్రశాంతి, ఏలూరు జిల్లా ఎస్పీ

ఏలూరు టౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఇంటి ముట్టడికి అంగన్‌వాడీ కార్యకర్తలు పిలుపునిచ్చారనీ, విజయవాడ పోలీస్ కమిషనర్ అనుమతులు లేవని ఎవరూ విజయవాడ వెళ్లేందుకు ప్రయత్నించవద్దని ఎస్పీ డి.మేరీ ప్రశాంతి అన్నారు. జిల్లా నుంచి అంగన్‌వాడీ కార్యకర్తలు విజయవాడకు వెళ్లడం ద్వారా శాంతిభద్రతల పరిరక్షణకు విఘాతం ఏర్పడుతుందని, చట్టాన్ని ఉల్లంఘిస్తే చర్యలు తప్పవన్నారు. చట్టాన్ని అతిక్రమించి ప్రవర్తిస్తే తీసుకునే చర్యలకు అంగన్‌వాడీ కార్యకర్తలే బాధ్యులని గుర్తు చేశారు.

ఉత్సవ పనులు ప్రారంభం



రాట ఏర్పాటుచేస్తున్న ఆలయ కమిటీ

దెందులూరు: దెందులూరు మండలం గాలాయగూడెంలో అచ్చమ్మ పేరంటాలమ్మ తల్లి ఆలయ ఉత్సవ పనులు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఆలయ ఆవరణలో కమిటీ సభ్యులు రాటను ఏర్పాటుచేశారు. తొలుత అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించారు.

భక్తజన పెన్నిధి.. మావుళ్లమ్మ సన్నిధి



మావుళ్లమ్మవారు

భక్తుల పాలిట కొంగు బంగారం.. కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి.. భీమవరం పట్టణ ఇలవేల్పు మావుళ్లమ్మవారి 60వ వార్షిక మహోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. దేవస్థానం వద్ద ఉత్సవాలతో పాటు విద్యుత్ వెలుగులు, భారీ కటౌట్లు, కళా ప్రదర్శనలను తిలకించేందుకు రాష్ట్ర నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివస్తున్నారు. ఈనెల 13న ప్రారంభమైన ఉత్సవాలు వచ్చే నెల 11వ తేదీ వరకు జరగనున్నాయి.

సిరుల తల్లి.. కల్పవల్లి

- వైభవంగా అమ్మవారి మహోత్సవాలు
- వేలాదిగా తరలివస్తున్న భక్తులు
- ఉత్సవాల్లో కళాకారులకు పెద్దపీట
- ఆలయం వద్ద పటిష్ట ఏర్పాట్లు



మాంపాహి మావుళ్లమ్మ.. ఆలయం వద్ద భక్తులు



నృత్య నీరాజనం.. చిన్నారుల నృత్య ప్రదర్శన



కాంతులకేళి.. భారీ సెట్టింగ్

భీమవరం (ప్రకాశం చౌక్): నీరుల్లి కూరగాయ పండ్ల వర్తక సంఘం, అమ్మవారి ఉత్సవ కమిటీ, దేవస్థానం సంయుక్తంగా ఏటా మావుళ్లమ్మ ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. సుమారు రూ.కోటి వరకు నిధులను వెచ్చిస్తున్నారు. ఉత్సవాలను తిలకించేందుకు విశాఖ, విజయవాడ వంటి దూర ప్రాంతాలతో పాటు తెలంగాణ నుంచి భక్తులు తరలివస్తున్నారు. సాధారణ రోజుల్లో సుమారు 5 వేల మంది, శుక్ర, ఆదివారాల్లో సుమారు 10 వేల మందికి పైగా భక్తులు అమ్మవారిని దర్శించుకుంటున్నారు.

విద్యుత్ ధగధగలు

అమ్మవారి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన విద్యుత్ లైటింగ్, క్లాత్ డెకరేషన్, భారీ సెట్టింగ్స్ అదరహో అనిపిస్తున్నాయి. విద్యుత్ లైటింగ్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. వీటిని వీక్షించేందుకు సాయంత్రం నుంచి రాత్రి వరకు జనం పోటెత్తుతున్నారు.

'కళ' కళలు : ఉత్సవాల్లో భాగంగా ఏటా కళలకు నిర్వాహకులు పెద్దపీట వేస్తున్నారు. నాటకాలు, జానపద, కూచిపూడి నృత్యాలు, భరత నాట్య ప్రదర్శనలు ఆకట్టుకుంటున్నాయి. ఆదరణ కోల్పోతున్న నాటకాలు, హరికథలు, బుర్రకథల కళాకారులకు ఉత్సవాల్లో భాగంగా నిర్వాహకులు ఉపాధి కల్పిస్తున్నారు. మొత్తంగా 20 పౌరాణిక నాటకాలు, 4 బుర్రకథలు, 7 హరికథలు, 13 మ్యూజికల్ నైట్స్, 13 కూచిపూడి నృత్య ప్రదర్శనలు ఏర్పాటుచేశారు.

భక్తులకు అన్నప్రసాదం : నీరుల్లి కూరగాయ పండ్ల వర్తక సంఘం, ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అమ్మవారి అన్నప్రసాదాన్ని అందిస్తున్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే వారికి ఇబ్బంది లేకుండా భోజన ఏర్పాట్లు చేశారు. ఉత్సవాలు ముగిసే వరకూ అన్నదానం కొనసాగనుంది.

మొక్కులు తీర్చుకుంటూ.. అమ్మవారిని దర్శించిన భక్తులు బంగారం, వెండి కానుకలు సమర్పిస్తున్నారు. ఆలయ అధికారులకు విరాళాలు కూడా అందిస్తున్నారు.

చాలా ఆనందంగా ఉంది



మావుళ్లమ్మవారి ఉత్సవాలను తిలకించేందుకు కుటుంబసమేతంగా విశాఖ నుంచి వచ్చాం. చాలా ఆనందంగా ఉంది. ఉత్సవాల్లో ఏర్పాటుచేసిన విద్యుత్ లైటింగ్, సెట్టింగ్స్ అద్భుతంగా ఉన్నాయి. ఉత్సవాలను నెలరోజుల పాటు నిర్వహించడం అభినందనీయం. అమ్మవారి ఆశీస్సులతోనే ఉత్సవాలు ఇంత ఘనంగా జరుగుతున్నాయి.

– కె.విజయ, విశాఖ

భోజన ఏర్పాట్లు బాగున్నాయి



దూరప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు భోజన ఇబ్బందులు లేకుండా ఉత్సవ నిర్వాహకులు అమ్మవారి సన్నిధి వద్దే భోజన ఏర్పాట్లు చేయడం బాగుంది. పెద్ద సంఖ్యలో భక్తులు వస్తున్నా భోజనం నాణ్యత తగ్గకుండా అందించడం అభినందనీయం. అమ్మవారి దర్శనం, ఉత్సవాలను తిలకించడం చాలా సంతోషంగా ఉంది.

– బి.ఇంద్రజ, రాజమండ్రి

డిప్యూటీ సీఎం కొట్టుకు కృతజ్ఞతలు



మంత్రి కొట్టు సత్యనారాయణకు పుష్పగుచ్ఛం ఇస్తున్న రొక్కాల నాగబుజ్జి

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రభుత్వ సబ్ డివిజన్ విజిలెన్స్ మోనిటరింగ్ కమిటీ సభ్యునిగా నియమితులైన రొక్కాల నాగబుజ్జి ఆదివారం డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణను కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి కృతజ్ఞతలు తెలిపారు. నాగబుజ్జి మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి అప్పగించిన బాధ్యతను సక్రమంగా నెరవేర్చుతానన్నారు. అనంతరం ఆర్డీఓ కె.చెన్నయ్య, ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంపత్ కుమార్, తహసీల్దార్ శివశంకర్, ఎంపీడీఓ విశ్వనాథ్‌ను కలిసి నాగబుజ్జి కృతజ్ఞతలు చెప్పారు.

పథకాలపై మరింత అవగాహన కల్పించాలి



సందర్శిస్తున్న వికసిత్ భారత్ పర్యవేక్షకురాలు

ద్వారకాతిరుమల: కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా అధికారులు కృషి చేయాలని కేంద్ర ప్రభుత్వ సాంస్కృతిక శాఖ జాయింట్ సెక్రటరీ, వికసిత్ భారత్ సంకల్ప యాత్ర పర్యవేక్షకురాలు నందూరి ఉమా అన్నారు. గుణ్ణంపల్లి హైస్కూల్‌లో సర్పంచ్ తానిగడప సుజాత ఆధ్వర్యంలో ఆదివారం వికసిత్ భారత్ సంకల్ప యాత్రపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఉమా మాట్లాడుతూ కేంద్ర పథకాలపై మరింత అవగాహన కల్పించాలన్నారు. సంక్షేమ పథకాలపై ప్రజలకు ఉన్న అవగాహన, అధికారుల పనితీరుపై ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. కేంద్ర ప్రాయోజిత పథకాలపై మాట్లాడారు. నానో డీఏపీ, యూరియా వినియోగంపై డ్రోన్ స్ప్రేయింగ్‌ను ప్రదర్శించారు. భారత్ ఆయుష్మాన్ ఐడీ కార్డులు, ఉజ్వల గ్యాస్ కనెక్షన్లను ఆమె అందజేశారు. జెడ్పీ సీఈఓ కె.సుబ్బారావు పాల్గొన్నారు.

ముగ్గురు బీఎల్‌ఓల సస్పెన్షన్

జంగారెడ్డిగూడెం: ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం మండలంలోని కేతవరం గ్రామంలో ముగ్గురు బూత్‌లెవెల్ ఆఫీసర్ల (బీఎల్‌ఓ)ను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఉత్తర్వులు జారీ చేసినట్లు తహసీల్దార్ కె.స్లీవజోజి ఆదివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలో మూడు పోలింగ్ కేంద్రాలకు బీఎల్‌ఓలుగా వీఆర్వో పి.రమేష్, వీఆర్ఏ బెనర్జీ, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ గణేష్ విధులు నిర్వహించారు. ఆయా కేంద్రాల పరిధిలో 27 మంది ఓటర్లు మృతి చెందగా.. వారి పేర్లను ఓటర్ల జాబితా నుంచి బీఎల్‌ఓలు తొలగించాల్సి ఉంది. అయితే తొలగించకపోవడంపై కలెక్టర్‌కు ఫిర్యాదులు అందాయి. దీనిపై తహసీల్దార్‌ని విచారణాధికారిగా నియమించి విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించినట్టు నిర్ధారణ కావడంతో ముగ్గురు బీఎల్‌ఓలను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఉత్తర్వులు జారీ చేశారు.

న్యాయ సేవలు మరింత చేరువ

అట్టహాసంగా ఏడీజే కోర్టు ప్రారంభం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న జస్టిస్ కృష్ణమోహన్



సీనియర్ అడ్వకేట్ వెంకటరత్నంను సత్కరిస్తున్న దృశ్యం



ఇన్‌చార్జి జడ్జిచే సేవలు ప్రారంభం

తాడేపల్లిగూడెం (టీఓసీ): తాడేపల్లిగూడెం కోర్టు సముదాయం భవనాల్లో నూతనంగా మంజూరైన 11వ అడిషనల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి (ఏడీజే) కోర్టును ఆధునీకరించి ఏర్పాటు చేసిన భవనంలో ఆదివారం ఉదయం ఆంధ్రప్రదేశ్ హైకోర్టు అడ్మినిస్ట్రేటివ్ న్యాయమూర్తి, జస్టిస్ కృష్ణమోహన్ ఘనంగా ప్రారంభించారు. ఆయన వెంట హైకోర్టు సీనియర్ న్యాయమూర్తి జస్టిస్ ఏవీ శేషసాయి, జస్టిస్ నైనాల జైసూర్య, జస్టిస్ సత్తి సుబ్బారెడ్డి, జస్టిస్ వి.గోపాలకృష్ణారావు, జిల్లా ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జి సి.పురుషోత్తంకుమార్, ఏడీజే కోర్టు ఇన్‌చార్జి జడ్జి బి.సత్యవతి హాజరయ్యారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొవ్వూరి అప్పిరెడ్డి అధ్యక్షతన, న్యాయవాదుల ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక మాగంటి కల్యాణ మండపంలో సభా కార్యక్రమం జరిగింది. న్యాయవాదులు కూనిరెడ్డి శ్రీనివాస్, టి.భోగేశ్వరరావు సభను నిర్వహించారు. తొలుత చిన్నారుల దేశభక్తి గీతాలు, నృత్యాలు అలరించాయి. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేశారు. జడ్జిలతో పాటు సీనియర్ అడ్వకేట్ బండారు వెంకటరత్నం, అడ్వకేట్ క్లర్క్ శేషగిరిని సత్కరించారు. కార్యక్రమంలో లా సెక్రటరీ జి.సత్య వరప్రభాకర్‌రావు, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రకాశ్‌బాబు, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సూర్య కిరణ్‌శ్రీ,, సెకండ్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి అన్నామణి, ఫస్ట్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి అరుంధతి, జిల్లాలోని జడ్జిలు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అప్పిరెడ్డి, కార్యదర్శి దాసరి ఏకాంత్, సీనియర్ న్యాయవాదులు మాకా శ్రీనివాసరావు, శిరిగినీడి విజయకృష్ణ, దుర్గాదేవి, శ్యాం ప్రసాద్ ముఖర్జీ, ఆర్‌వీఎస్ సోమేశ్వరరావు, డీఎస్ రామారావు, న్యాయవాదులు హాజరయ్యారు.

న్యాయమూర్తులకు ఘన స్వాగతం

న్యాయమూర్తులకు తొలుత అర్చకులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. పోలీస్ గౌరవ వందనం అందజేశారు. ఏడీజే కోర్టును, జడ్జి చాంబర్, ఆఫీస్ రూమ్‌లను జడ్జిలు ప్రారంభించారు. అర్చకులచే వాస్తు పూజలు జరిగాయి. ఏడీజే కోర్టులో సర్వమత ప్రార్థనలు చేశారు. ఇన్‌చార్జి జడ్జి సత్యవతిచే కోర్టు సేవలు ప్రారంభమయ్యాయి. ప్రజలు, న్యాయవాదుల సౌకర్యార్థం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అప్పిరెడ్డి ఆధ్వర్యంలో అసోసియేషన్ కార్యాలయంలోని రూంలో జడ్జిలచే సబ్ పోస్టు ఆఫీస్‌ను ప్రారంభించారు. అనంతరం కోర్టు భవనాల సముదాయాన్ని, కోర్టు వద్ద ఉన్న సబ్‌జైలును పరిశీలించారు.

జలం.. పుష్కలం

- నీటి ఎద్దడి లేకుండా చర్యలు
- గోదావరిలో 3 టీఎంసీల నీరు
- పశ్చిమ డెల్టాకు 5 వేల క్యూసెక్కులు
- ఫిబ్రవరి నుంచి వంతుల వారీ విధానం



వెంకయ్య వయ్యేరు పంట కాలువ

ఆకివీడు: రబీ సాగు ఆలస్యంగా ప్రారంభమైనా సాగునీటి వనరులు పుష్కలంగా ఉండటంతో నీటి ఎద్దడి తలెత్తే అవకాశాలు తక్కువగా ఉన్నాయి. అలాగే నీటిఎద్దడి లేకుండా అధికారులు ముందస్తు జాగ్రత్తలు పాటిస్తూ.. బొట్టుబొట్టూ ఒడిసి పడుతూ నీటిని వినియోగించుకోవాలని సూచిస్తున్నారు. వేసవి వచ్చిందంటే ఎగువ ప్రాంతాల వారికి నీటి సమస్య ఎండమావిగా ఉంటుంది. రబీ సాగుకు నీటి కష్టాలు తప్పవన్నట్లుగానే సాగును అన్నదాతలు పూర్తి చేస్తున్నారు. అయితే ఈ ఏడాది భారీ వర్షాలు, వరదలకు గోదావరిలో, పంట కాలువల్లో నీరు పుష్కలంగా ఉంది. గోదావరిలో విజ్జేశ్వరం వద్ద 3 టీఎంసీల నీటి నిల్వ కొనసాగుతోంది. పశ్చిమ డెల్టాకు 5 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

వచ్చేనెలలో వంతుల వారీ విధానం

ఫిబ్రవరి మొదటి వారంలో వంతుల వారీ విధానంలో నీటిని సరఫరా చేసేందుకు జిల్లా యంత్రాంగం కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తుంది. విజ్జేశ్వరం లాకుల వద్ద నుంచి వారానికి ఒక పంట కాలువకు సరిపడే నీటిని విడుదల చేయనున్నారు. జీఅండ్‌వీ కెనాల్, నరసాపురం బ్యాంక్ కెనాల్, వీ అండ్ డబ్ల్యూ, ఏలూరు, అత్తిలి, వీ అండ్ డబ్ల్యూ కెనాల్ (నందమూరు వైర్) కాలువలకు వారానికి ఒకరోజు చొప్పున వంతు నీరు సరఫరా చేస్తారు.

- జిల్లాలో 2,23,000 ఎకరాల్లో రబీ సాగు చేపట్టనున్నారు.
- మొత్తం 6,000 క్యూసెక్కుల నీరు అవసరం.
- ప్రస్తుతం నాట్ల దశలో రబీ సాగు ఉంది.
- ఆయా పంట కాలువలకు 5,000 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు.
- ఇప్పటికే 86,600 ఎకరాల్లో రబీ నాట్లు పూర్తయ్యాయి.
- ఇంకా 1,36,400 ఎకరాల్లో నాట్లు పూర్తికావాల్సి ఉంది.
- మిచాంగ్ తుపాను ప్రభావంతో రబీ నాట్లు నెల రోజులు వెనక్కి వెళ్లాయి.
- సాగు ఆలస్యం కావడంతో ఏప్రిల్ నెలాఖరు వరకూ మాసూళ్లు పూర్తయ్యే అవకాశం లేదు. దీంతో మార్చి నెలాఖరు వరకు పంట కాలువలకు నీరు సరఫరా చేయాల్సి ఉంది.
- తుపాను ప్రభావిత భారీ వర్షాలకు పంట కాలువలు, చెరువులు, గోదావరిలో నీటిమట్టం భారీగా పెరిగింది. అయితే వేసవి సమీపిస్తుండటంతో నీటిమట్టం క్రమేపి తగ్గుతోంది.
- వంతుల వారీ విధానం గత రబీ సీజన్‌లో జనవరిలోనే ప్రారంభించినా.. ప్రస్తుతం నీటి నిల్వలు ఉండటంతో ఫిబ్రవరి నెలకు పొడిగించారు.
- జిల్లాలోని అన్ని పంట కాలువల్లో తూడు, గుర్రపుడెక్క తొలగించేందుకు నిధులు మంజూరు చేశారు. కాంట్రాక్టర్లు చాలా చోట్ల పనులు చేపట్టారు.

సాగుకు ఇబ్బంది లేకుండా..



సాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపడుతున్నాం. పశ్చిమ డెల్టాకు 5 వేల క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నాం. వేలాది ఎకరాల్లో నాట్లు వేయాల్సి ఉంది. రబీ సాగుకు ఇబ్బంది లేకుండా ప్రణాళిక రూపొందిస్తున్నాం.

– కె.శ్రీనివాసరావు, సూపరింటెండెంట్ ఇంజనీర్, ఇరిగేషన్ శాఖ

నాట్లు ఆలస్యం కావడంతో..



మిచాంగ్ తుపాను ప్రభావంతో ఖరీఫ్ మాసూళ్లు, రబీ నాట్లు ఆలస్యమయ్యాయి. ఫిబ్రవరి చివరికి రబీ నాట్లు పూర్తవుతాయి. ఏప్రిల్ నెలాఖరికి మాసూళ్లు పూర్తవుతాయి. ఏప్రిల్ మొదటి వారం వరకు సాగునీరు అవసరం ఉంది.

– జెడ్.వెంకటేశ్వర్లు, జేడీ, వ్యవసాయ శాఖ, పశ్చిమగోదావరి జిల్లా

సమన్వయంతో వినియోగం



అధికారులు, రైతులు సమన్వయంతో నీటి వినియోగాన్ని చేపట్టాలి. నీటి విడుదల, కాలువల్లో గుర్రపుడెక్క తొలగింపులో అధికారుల నిర్లక్ష్యం వల్ల శివారు ప్రాంత రైతులు ఇబ్బంది పడుతున్నారు. నీటిఎద్దడి తలెత్తకుండా చూడాలి.

– నంద్యాల సీతారామయ్య, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్, కుప్పనపూడి, ఆకివీడు మండలం

రూ.1.32 కోట్లతో తూడు తొలగింపు



ఉండి సబ్ డివిజన్ పరిధిలో పంట కాలువల్లో తూడు తొలగింపునకు రూ.1,32,25,959తో టెండరు పనులు చేపట్టారు. కాలువల కట్టేసే వరకు మెయింటెనెన్స్ పనులు చేపడుతుండాలి. నీటి సరఫరాకు అడ్డం లేకుండా తూడు తొలగిస్తారు.

– పీఎస్‌వీవీ సత్యనారాయణమూర్తి, డీఈ ఇరిగేషన్, ఉండి సబ్ డివిజన్

క్లుప్తంగా

అభాసుపాలైన టీడీపీ

జనసేన మద్దతు సర్పంచ్‌ను వైఎస్సార్ సీపీ సర్పంచ్‌గా చూపడంపై ఆక్షేపణ

పెనుగొండ: జనసేన మద్దతుతో గెలిచిన సిద్ధాంతం సర్పంచ్ చింతపల్లి గనిరాజు (చంటి)ని వైఎస్సార్ సీపీ సర్పంచ్‌గా ప్రకటిస్తూ టీడీపీలో చేర్చుకుని అభాసుపాలైందంటూ పలువురు ఆక్షేపణ వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం రాత్రి సిద్ధాంతంలో మాజీ మంత్రి పితాని సత్యనారాయణ పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ చింతపల్లి గనిరాజు టీడీపీలో చేరారు. ఈ తరుణంలో టీడీపీ నాయకులు అత్యుత్సాహంతో వైఎస్సార్ సీపీ సర్పంచ్ టీడీపీలో చేరుతున్నారంటూ ప్రచారం నిర్వహించారు. జనసేన మద్దతుతో సిద్ధాంతంలో గనిరాజు వైఎస్సార్ సీపీ మద్దతు పలికిన నక్కా అజయ్‌కుమార్‌పై గెలిచారు. వైఎస్సార్ సీపీ మద్దతు పలకకపోవడంతోనే ఆగ్రహించిన గనిరాజు జనసేన మద్దతుతో సర్పంచ్‌గా విజయం సాధించిన విషయం విదితమే. ఈ తరుణంలో వైఎస్సార్ సీపీ ప్రకటించడంతో తెలుగుదేశం పార్టీ అభాసుపాలైంది.

జనసేన గుర్రు

కాగా, పొత్తు ధర్మాన్ని విస్మరిస్తూ జనసేనకు చెందిన సర్పంచ్ గనిరాజును టీడీపీలో చేర్చుకోవడంపై జనసేన కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో సిద్ధాంతం నుంచి సర్పంచ్, ఓ ఎంపీటీసీ, రామన్నపాలెం నుంచి ఓ ఎంపీటీసీ జనసేన మద్దతుతో గెలిచారు. వీరిలో సర్పంచ్‌ను తెలుగుదేశం పార్టీలో చేర్చుకోవడంతో జనసేన నాయకులు అవాక్కయ్యారు. ఇప్పటికే రా.. కదలిరా సభలో స్థానిక జనసేన నాయకులకు సముచిత స్థానం కల్పించలేదన్న ఆగ్రహంతో ఉన్న నాయకులకు సర్పంచ్‌ను లాగేసుకోవడంతో పుండుమీద కారం చల్లినట్లుగా తయారైంది. పొత్తులో ఉన్నా ఆచంట నియోజకవర్గంలో జనసేనపై తెలుగు దేశం నాయకత్వం తూట్లు పొడవడం ఎంతవరకూ సబబంటూ ప్రశ్నిస్తున్నారు.

శ్రీవారి సేవలో ఐఏఎస్ అధికారిణి ఉమ

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయాన్ని కేంద్ర ప్రభుత్వ సీనియర్ ఐఏఎస్ అధికారిణి నండూరి ఉమ ఆదివారం సందర్శించారు. దేవస్థానం అధికారులు ఆమెకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ముఖ మండపంలో అర్చకులు, పండితులు ఆమెకు వేద ఆశీర్వచనాన్ని పలుకగా, ఆలయ ఏఈఓ శ్రీవారి చిత్రపటాన్ని, ప్రసాదాలను అందజేశారు.

కొల్లేరు వారధి కల సాకారం

- సర్కారు కాలువపై వంతెన పనులు పూర్తి
- రూ.14.70 కోట్ల వ్యయంతో వారధి నిర్మాణం
- కొల్లేరు లంక గ్రామాలకు మెరుగుపడిన రహదారి సౌకర్యం
- సీఎం వైఎస్ జగన్ హామీ అమలుతో తీరిన కొల్లేరు వాసుల చిరకాల స్వప్నం

గతంలో వరదొస్తోందంటే చాలు కొల్లేరు వాసుల గుండెల్లో రైళ్లు పరిగెట్టేవి. సర్కారు కాల్వపై నిర్మించిన తాత్కాలిక కర్రల వంతెన మునిగి నెలల తరబడి రాకపోకలు నిలిచి బాహ్యప్రపంచంతో కొల్లేరు లంక గ్రామాలకు సంబంధాలు తెగిపోయేవి. ఇక అత్యవసర పరిస్థితి అయితే వారి బాధలు వర్ణనాతీతం. ఇక్కడ వారధి నిర్మించాలంటూ దశాబ్దాలుగా కొల్లేరు ప్రజలు ఎన్నోసార్లు ప్రభుత్వాలకు మొరపెట్టుకున్నా పట్టలేదు. ఈ క్రమంలో మహానేత వైఎస్సార్ ప్రభుత్వంలో నిధులు కేటాయించగా, ఆయన కుమారుడు సీఎం వైఎస్ జగన్ ఇచ్చిన హామీ మేరకు కొల్లేరు ప్రజల వారధి కల సాకారమైంది.



సర్కారు కాల్వపై వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిర్మించిన వారధి



గతంలో నిర్మించిన కర్రల వంతెన (ఫైల్)



వరదల సమయంలో వంతెన (ఫైల్)

కైకలూరు: ఎన్నికల్లో మాట ఇవ్వడమే కాదు.. చిత్తశుద్ధితో అమలు చేసి చూపిస్తాం అనడానికి నిలువెత్తు నిదర్శనం సర్కారు కాల్వపై వారధి నిర్మాణం. అనేక దశాబ్దాలుగా అమలుకు నోచుకోని వారధి నిర్మాణాన్ని వైఎస్సార్ సీపీ నాలుగున్నరేళ్ల పాలనలో సాకారం చేయడంతో కొల్లేరు ప్రజలు చిరకాల వాంఛ నెరవేరింది. బీజేపీ ఎమ్మెల్యేగా గెలిచి పొత్తుల్లో భాగంగా గత ప్రభుత్వంలో కామినేని శ్రీనివాస్ రాష్ట్ర మంత్రిగా వ్యవహరించారు. కేంద్రానికి, తెలుగుదేశం పార్టీకి సంధానకర్తగా వ్యవహరించినా సర్కారు కాల్వ వారధి నిర్మాణం పూర్తి చేయటంలో కామినేని విఫలమయ్యారు. నేడు ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) సీఎం వైఎస్ జగన్‌కు పరిస్థితిని వివరించి నిధులు తెచ్చి వారధి నిర్మాణాన్ని పూర్తి చేసి కొల్లేరు ప్రజలకు అంకితం ఇచ్చారు.

చరిత్ర ఇది...

ముఖ్యమంత్రి నేదురుమిల్లి జనార్దనరెడ్డి 1991లో సర్కారు కాల్వపై పెద్దింట్లమ్మ వారధి నిర్మాణానికి రూ.1.50 కోట్లు కేటాయించారు. అనంతరం 1992లో నిర్మాణ వ్యయాన్ని రూ.2.50 కోట్లకు పెంచారు. ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి జక్కంపూడి రామ్మోహనరావు 2004లో నిర్మాణ వ్యయాన్ని రూ.7 కోట్లకు పెంచారు. తర్వాత 2009లో వైఎస్ రాజశేఖరరెడ్డి వారధి నిర్మాణానికి రూ.12 కోట్లు కేటాయించారు. ఆయన ఆకస్మిక మరణంతో నిర్మాణం నిలిచింది. గత ప్రభుత్వం రూ.14.70 కోట్లు కేటాయించింది. అరకొర పనులు జరిగాయి. తీసుకొచ్చిన ఇనుము సైతం తుప్పు పట్టింది. నేడు ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) కృషితో సీఎం వైఎస్ జగన్ ప్రత్యేక శ్రద్ధ చూపి గత ప్రభుత్వం కాంట్రాక్టర్‌కు చెల్లించాల్సిన బకాయిలను సైతం చెల్లించి వారధి నిర్మాణం పూర్తి చేశారు.

కొల్లేరు గ్రామాలకు అనుసంధానం

ఏలూరు జిల్లాలో ఏలూరు, కైకలూరు, ఉంగుటూరు, దెందులూరు, పశ్చిమగోదావరి జిల్లాలో ఉండి నియోజకవర్గాల్లో 9 మండలాల్లో 122 గ్రామాల్లో కొల్లేరు సరస్సు విస్తరించి ఉంది. మొత్తం 76 వేల కుటుంబాలకు సంబంధించి 3.10 లక్షల మంది జనాభా నివసిస్తున్నారు. పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడు నుంచి బస్సులో ఏలూరు జిల్లా ప్రధాన కేంద్రం ఏలూరు చేరాలంటే కైకలూరు మీదుగా 40 కిలోమీటర్ల దూరం. అదే సర్కారు కాల్వపై వారధి నుంచి కొల్లేటికోట మీదుగా ఏలూరు చేరితే 10 కిలోమీటర్ల దూరాభారం తగ్గుతుంది. ఆక్వా ఉత్పత్తుల రవాణా సైతం పెరుగుతోంది. కొల్లేరు గ్రామాలను కలుపుతూ ఆర్టీసీ బస్సు ఏర్పాటుపై కూడా ప్రభుత్వం ఆలోచన చేస్తోంది.

పెద్దింట్లమ్మ దేవస్థానానికి మార్గం సుగమం

కొల్లేరు సరస్సు తీరాన 11వ శతాబ్ది కాలంలో వేంగి–చాళుక్య రాజులు నిర్మించిన కొల్లేటికోట పెద్దింట్లమ్మ దేవస్థానం ఆధ్యాత్మిక శోభతో అలరారుతోంది. దీనికి తోడు సమీప జిల్లాల్లో ఎక్కడా లేని విధంగా దాతల సాయం రూ.4.50 కోట్లతో అనివేటి మండపం నిర్మిస్తున్నారు. ప్రతి ఏటా పెద్దింట్లమ్మ జాతర (తీర్థం) వైభవంగా జరుగుతుంది. లక్షలాది భక్తులు అమ్మవారిని దర్శించుకుంటారు. ప్రతి ఆదివారం పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లిస్తారు. ఇంతటి ప్రాధాన్యత కలిగిన దేవస్థానం చేరుకోడానికి గతంలో సర్కారు కాల్వపై ఇనుప వంతెన మాత్రమే ఉండేది. ప్రయాణికుల నుంచి అనధికార టోల్‌గేటు ద్వారా అనేక సంవత్సరాలుగా వసూలు చేస్తున్నారు. వారధి నిర్మాణంతో ఇటువంటి సమస్యలు తొలగిపోగా, దేవస్థానం వరకు నేరుగా వాహనాలు చేరుతున్నాయి.

స్వప్నం నెరవేరింది



కొల్లేరు లంక గ్రామాల ప్రజల చిరకాల స్వప్నం సర్కారు కాల్వపై వారధి నిర్మాణం. గతంలో తాత్కాలిక కర్రల వంతెన ఉండటంతో ఎగువనున్న గ్రామాలైన శృంగవరప్పాడు, గుమ్ముళ్లపాడు, పందిరిపల్లిగూడెం, కొల్లేటికోట, గోకర్ణపురం ప్రజలు వరదల సమయంలో అష్టకష్టాలు పడేవారు. నెలల తరబడి వంతెన మునిగి ఉండేది. అటువంటిది వంతెన నిర్మాణం పూర్తి చేసి సీఎం జగన్ చేసిన వాగ్దానాన్ని నిలబెట్టుకున్నారు.

– ఘంటసాల భాగ్యలక్ష్మి, సర్పంచ్, శృంగవరప్పాడు

పెద్దింట్లమ్మ దేవస్థానం వరకు బస్సులు



సర్కారు కాల్వపై వారధి నిర్మాణంతో కొల్లేటికోట పెద్దింట్లమ్మ దేవస్థానంకు వచ్చే భక్తుల రాకపోకలకు మరింత వీలు కలిగింది. నేరుగా ఆర్టీసీ బస్సులు దేవస్థానం వరకు వచ్చే అవకాశం ఉంది. అమ్మవారి దేవస్థానం మీదుగా ఏలూరు చేరుకునే అవకాశం ఉంది. వారధి నిర్మాణంతో పాటు దేవస్థానం వద్ద అనివేటి మండప నిర్మాణానికి ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) కృషి చేస్తున్నారు.

– కందుల వేణుగోపాలరావు, ఈవో పెద్దింట్లమ్మ దేవస్థానం, కొల్లేటికోట

కొల్లేరు ప్రజలంటే సీఎంకు ఎంతో అభిమానం



కొల్లేరు ప్రజలంటే సీఎం వైఎస్ జగన్‌కు ఎంతో అభిమానం. అధికారంలోకి రాగానే ఆక్వా రైతులకు మేలు చేసేలా విద్యుత్ యూనిట్‌ను రూ.1.50లకు అందించారు. కొల్లేరు ప్రాంతానికి చెందిన జయమంగళ వెంకటరమణకు ఎమ్మెల్సీ సీటు ఇచ్చారు. సర్కారు కాల్వపై వారధి నిర్మాణం కలగానే మిగిలుతుందనుకున్నాం. నేడు వారధి పూర్తయి కళ్ల ముందు నిలిచింది. కొల్లేరు ప్రాంత ప్రజలందరూ సీఎం జగన్‌కు అండగా నిలుస్తారు.

– కొయ్యే గంగయ్య, సర్పంచ్, పందిరిపల్లిగూడెం

హత్య కేసులో నిందితుడి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ అశోక్‌కుమార్ గౌడ్

చాట్రాయి: బూరుగుగూడెం హత్య కేసులో నిందితుడిని అరెస్టు చేసినట్టు నూజివీడు డీఎస్పీ అశోక్ కుమార్‌గౌడ్ చెప్పారు. ఆదివారం ఆయన విలేకరులకు కేసు వివరాలను వెల్లడించారు. చీపురుగూడెం గ్రామానికి చెందిన అబ్బదాసరి కృష్ణ మండలంలోని బూరుగుగూడెం గ్రామంలో ఉంటున్న తన సోదరి గద్దల ఆరోగ్యం ఇంటికి ఈ నెల 17న వచ్చాడు. అదే రోజున తిరువూరు మండలం మల్లేల గ్రామానికి చెందిన పత్తిపాటి నాగరాజు ఆరోగ్యం ఇంటికి వచ్చాడు. ఆరోగ్యంతో తనకు ఉన్న వివాహేతర సంబంధానికి అడ్డు తగులుతున్నాడనే అక్కసుతో కృష్ణ తలపై నాగరాజు కత్తిపీటతో దాడి చేసి కొట్టాడు. దీంతో తీవ్ర గాయం కావడంతో వెంటనే అతనిని చింతలపూడి ఆస్పత్రికి తీసుకువెళ్లగా, అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఈ నెల 19న కృష్ణ మృతి చెందాడు. మృతుడి తల్లి అబ్బదాసరి నీలమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో ఆదివారం మండలంలోని చనుబండ గ్రామంలో కొర్లమండ రోడ్డులో నడుచుకుంటూ వెళుతూ పోలీసులను చూసి పారిపోతుండగా నూజివీడు రూరల్ సీఐ పి.బాల సురేష్ బాబు, ఎస్సై సీహెచ్ స్వామి వెంబడించి నాగరాజుని అదుపులోకి తీసుకున్నారు. ఆరోగ్యంతో తనకు ఉన్న వివాహేతర సంబంధానికి తరచూ అడ్డు వస్తున్నాడనే కత్తిపీటతో దాడి చేశానని నాగరాజు విచారణలో అంగీకరించాడు. అనంతరం నిందితుడిని తిరువూరు కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించినట్లు డీఎస్పీ వివరించారు.

రైతు శాస్త్రవేత్త కోర్సు ఆదర్శనీయం

ఏలూరు జిల్లాలో బంగ్లాదేశ్ బృందం రెండో రోజు పర్యటన



ఉంగుటూరు మండలంలో పర్యటిస్తున్న బంగ్లాదేశ్ బృందం

ఉంగుటూరు: రైతు సాధికార సంస్థ రాష్ట్రంలో అమలు చేస్తున్న రైతు శాస్త్రవేత్త కోర్సు ప్రపంచానికి ఆదర్శమని బంగ్లాదేశ్ ప్రతినిధి బృందం ప్రశంసించింది. రాష్ట్రంలో రెండో రోజు పర్యటనలో భాగంగా ఆదివారం బృందం సభ్యులు ఏలూరు జిల్లా మండలంలోని వెంకటరామన్నగూడెం, పెద్ద వెల్లమిల్లి, నాచుగుంట గ్రామాల్లోని వేర్వేరు రైతుల ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా పెద్ద వెల్లమిల్లిలోని రాజేంద్రప్రసాద్ ప్రకృతి వ్యవసాయ క్షేత్రంలో రైతు శాస్త్రవేత్తలు, మెంటార్‌లతో బృంద సభ్యులు సమావేశమయ్యారు. రైతు శాస్త్రవేత్తలను ఉద్దేశించి మాట్లాడుతూ వ్యవసాయంలో డిగ్రీ కలిగిన వ్యవసాయ నిపుణులు ఒకవైపు ప్రకృతి వ్యవసాయం చేస్తూనే రైతులకు సలహాలు సూచనలు అందిస్తూ ఏటీఎం (ఎనీ టైం మనీ) ఏ గ్రేడ్, ఐదు అంతస్తుల నమూనా సమీకృత మోడల్ తదితర ఆదర్శనీయ వ్యవసాయ క్షేత్రాలను తీర్చిదిద్దుతున్నారని రైతు శాస్త్రవేత్తలకు హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. తమ దేశంలో చేస్తున్న ప్రకృతి వ్యవసాయంతో పోల్చితే ఇక్కడ సాగు ఎంతో మెరుగ్గా ఉందని కితాబిచ్చారు. రైతు శాస్త్రవేత్తల్లో మహిళలు కూడా అధిక సంఖ్యలో ఉండటం వ్యవసాయంలో మహిళల ప్రోత్సాహానికి అద్దం పడుతోందన్నారు. రైతు శాస్త్రవేత్తలను ప్రకృతి వ్యవసాయ విధానంలో చేస్తున్న పరిశోధనలు, సాధిస్తున్న ఫలితాలను అడిగి తెలుసుకున్నారు. బంగ్లాదేశ్ బృందం తొలుత వెంకటరామన్నగూడెంలోని రాజేంద్రప్రసాద్ అనే రైతుకు చెందిన ఒక ఎకరా విస్తీర్ణంలో అనుసరిస్తున్న పాలి వెజిటబుల్ మోడల్‌ను సందర్శించింది. ఎకరాకు ఏడాది కాలంలో రూ.1.52 లక్షల ఖర్చుతో రూ.2,85,700 ఆదాయం ఆర్జించినట్లు బృంద సభ్యులకు రైతు వివరించారు. ప్రకృతి వ్యవసాయంలోకి రాక ముందు కేవలం వరి సాగు మాత్రమే చేశానని, అయితే ప్రకృతి వ్యవసాయ విధానంలో వరితో పాటు ఫిష్ పాండ్, 20 రకాల పండ్లు, కూరగాయలు పండిస్తున్నట్లు చెప్పారు. గతంలో కేవలం 40 వేల ఆదాయం ఉండేదని, ఈ సమీకృత ప్రకృతి వ్యవసాయం వల్ల సాగు లాభసాటిగా ఉందన్నారు. నాచుగుంట గ్రామంలోని జి.వెంకట రత్నాజి వ్యవసాయ క్షేత్ర పరిధిలోని 70 ఎకరాల కాంపాక్ట్ బ్లాక్‌ను సందర్శించారు. అక్కడ రైతు పండిస్తున్న విధానాలతో పాటు, మార్కెటింగ్ సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విజయవాడ తిరిగి వెళ్తూ మార్గమధ్యంలో ఆర్గానిక్ స్టోర్‌ను సందర్శించారు. ఈ పర్యటనలో రైతు సాధికార సంస్థ థిమాటిక్ లీడ్‌కు అరుణ, శ్రీరాము ఏలూరి సురేష్, జిల్లా ప్రాజెక్టు మేనేజర్ తాతా రావు, అదనపు డీపీఎం వలి పాల్గొన్నారు.

వీక్షకులకు కనువిందు

- పాలకొల్లులో ముగిసిన చిత్రకళా ప్రదర్శన
- ఆకట్టుకున్న పలు పెయింటింగ్‌లు
- వపా బాపు ఆర్ట్ అకాడమీ, పాలకొల్లు లయన్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహణ





పాలకొల్లు చిత్రకళా ప్రదర్శనలో ఆకట్టుకుంటున్న పెయింటింగ్‌లు, అంతరచిత్రంలో నైల్, థ్రెడ్‌లతో అల్లిన ఆర్ట్స్

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలోని లయన్స్ కమ్యూనిటీ హాలులో వపా బాపు ఆర్ట్ అకాడమీ, పాలకొల్లు లయన్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఎనిమిదో వార్షికోత్సవ చిత్ర కళా ప్రదర్శన వీక్షకులకు కనువిందు చేసింది. రెండు రోజుల పాటు జరిగిన ఈ చిత్ర కళా ప్రదర్శన ఆదివారం ముగిసింది. దీనిలో దక్షిణ భారత చిత్రకారులు గీసిన పలు పెయింటింగ్‌లు, చిత్రాలు ప్రదర్శనలో కళాప్రియులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. చిత్రకారుల కుంచె నుంచి జాలువారిన ఈ కళాఖండాలు ప్రేక్షకులను కనువిందు చేశాయి. చిత్రకళా ప్రేమికులను నైల్స్ అండ్ థ్రెడ్, వాటర్ పెయింటింగ్స్ ఎంతగానో అలరించాయి. కార్యక్రమం అనంతరం చిత్రాలయ రాంబాబు, కేతా బాబు, ఆర్టిస్టులను, కొమ్ముల మురళీకృష్ణలను, స్పాట్ పెయింటింగ్‌లో పాల్గొన్న చిత్రకారులను సత్కరించారు. అలాగే చిత్రలేఖనం పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు చిత్రకారులు మాట్లాడుతూ నేటి తరం తల్లిదండ్రులు తమ పిల్లలు ఎంసీఏ, ఎంబీఏ, సాఫ్ట్‌వేర్ రంగాల్లో ఉండాలనే ఆలోచిస్తున్నారే తప్ప కళలపై మక్కువ చూపడం లేదన్నారు. దీంతో భవిష్యత్‌లో చిత్రకళ కనుమరుగయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చిత్రలేఖనాన్ని విద్యగా భావించి అనంతరం వృత్తిగా కొనసాగించుకోవచ్చని, దీనిపై యువత ప్రత్యేక శ్రద్ధ కనపరిచేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని అంటున్నారు. ఇంకా అనేక అంశాలు వారి అభిప్రాయాల్లో..

చిత్రకారులుగా తీర్చిదిద్దడమే లక్ష్యం



పాలకొల్లులో మా గురువు జీఎస్ఎన్ వద్ద ఆర్ట్స్‌లో ఓనమాలు నేర్చుకున్నాను. పాలకొల్లు నుంచి చెన్నై వెళ్లి 42 ఏళ్లు అయ్యింది. చెన్నైలో పబ్లిసిటీ డిజైనర్ అంకయ్య వద్ద చేరాను. ఆర్ట్‌పై ఉన్న మక్కువతో వడ్డాది పాపయ్య, బాపు పేరున వపా బాపు ఆర్ట్ అకాడమీని స్థాపించాను. ఎనిమిదేళ్లుగా ఇక్కడ క్యాంపు నిర్వహిస్తున్నాం. దీని ద్వారా పాలకొల్లు నుంచి పది మందినైనా ఆర్ట్ కళాకారులుగా తీర్చిదిద్దాలనుకుంటున్నాం. జిల్లాలో ఇంకా ఎక్కడైనా ఈ చిత్రకళా ప్రదర్శన నిర్వహించాలనుకుంటే ఆర్గనైజింగ్ చేసే కళాకారులు ఉంటే తప్పనిసరిగా ఏర్పాటు చేస్తాం.

– డి.రామకృష్ణారావు (రాఖీ), వ్యవస్థాపకులు, వపా బాపు ఆర్ట్ అకాడమీ, చెన్నై

పెదగోపురం పెయింట్‌తో గుర్తింపు



గతంలో పాలకొల్లు పెదగోపురం, షాపింగ్ కాంప్లెక్స్, మెయిన్ రోడ్డు, భక్తులు ఆలయంలోకి వెళుతున్న సందర్భంతో పెయింటింగ్ వేశాను. సమయం కుదిరినప్పుడల్లా ఈ పెయింటింగ్ వేయగా 20 రోజులు పట్టింది. ముందుగా ఇలాగే ఓ పెయింట్ వేయగా సోషల్ మీడియాలో ఎనలేని గుర్తింపు వచ్చింది. దీంతో మళ్లీ ఈ పెయింట్ వేసి ఇక్కడ ప్రదర్శనలో ఏర్పాటు చేశా. 23 ఏళ్ల నుంచి ఈ వృత్తిలో కొనసాగుతున్నా. చెన్నైలోని ఫైన్ ఆర్ట్స్ అకాడమిలో శిక్షణ పొందాను. ఆర్టిస్ట్ రాఖీ ప్రోత్సాహంతోనే ముందుకు వెళ్లగలిగాను.

– శ్రీను, సిరివల్లి ఆర్ట్స్, పాలకొల్లు

చిత్రకళపై మక్కువ పెంచాలి



ఎంతో మంది యువకులకు చిత్రకళలో తర్ఫీదునిచ్చా. పాలకొల్లులో గత ఎనిమిదేళ్లుగా చిత్ర కళ ప్రదర్శన నిర్వహిస్తున్నాం. ఈ చిత్రకళ ప్రదర్శనకు చెన్నై, బెంగుళూరు ప్రాంతాల నుంచి ఎంతో మంది కళాకారులు ఇక్కడకు వచ్చి స్పాట్ పెయింటింగ్స్ వేసి కళాభిమానులను ఉత్సాహపరుస్తుంటారు. నేటితరం యువతకు చిత్రకళపై మక్కువ పెరిగేలా చూడాల్సిన బాధ్యత తల్లిదండ్రులదే.

– జీఎస్ఎన్, చిత్రకారుడు పాలకొల్లు

పిల్లల్లో ఆసక్తి ఉన్నా ప్రోత్సాహం లేదు



నైల్స్ అండ్ థ్రెడ్ ఆర్ట్ ఈ ఆర్ట్‌కి కావలసింది గుండు సూదులు వాటితో థ్రెడ్ లేక నైల్స్‌తో ఆర్ట్‌ను వేస్తాం. ఇక్కడి చిత్రకళా ప్రదర్శనను చూడటానికి వచ్చిన విద్యార్థులు ఎంతో మంది ఈ ఆర్ట్స్ నేర్చుకోవడానికి మక్కువ చూపించడం ఆశ్చర్యంగా అనిపించింది. పిల్లల్లో ఆర్ట్స్‌పై మక్కువ ఉన్నా వీటి ప్రాముఖ్యతను తెలియజేసే వారు లేకపోవడం విచారకరం. ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులు కూడా చిత్రకళలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటే విద్యార్థులకు చిత్రకళపై మక్కువ పెరుగుతుంది.

– మోహనుడు, చెన్నై, నైల్స్ అండ్ థ్రెడ్ ఆర్టిస్ట్

సంఘటిత పోరాటాలతో సమస్యల పరిష్కారం

ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు సుబ్బారావు



జిల్లాకు నూతన కమిటీ ఎన్నికైన జిల్లా కమిటీ నాయకత్వంతో రాష్ట్ర నాయకులు

వీరవాసరం: సంఘటిత పోరాటాలతో జర్నలిస్టుల సమస్యలు పరిష్కారమవుతాయని ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపీయూడబ్ల్యూజే) రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు అన్నారు. జర్నలిస్టుల సమస్యలపై రాజీ లేకుండా పోరాడుతున్నది ఒక్క ఏపీయూడబ్ల్యూజే మాత్రమేనని చెప్పారు. యూనియన్ జిల్లా 36వ మహాసభ వీరవాసరం తులసీ కన్వెన్షన్‌లో ఆదివారం నిర్వహించారు. యూనియన్ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షుడు జీవీఎస్ఎన్ రాజు అధ్యక్షతన జరిగిన సభలకు ముఖ్య అతిథిగా హాజరైన ఐవీ సుబ్బారావు మాట్లాడుతూ రాష్ట్ర విభజన తరువాత అప్పటి సీఎం చంద్రబాబును కలిసి సమస్యలు వివరించామన్నారు. జర్నలిస్టుల సమస్యలపై మంత్రి కాలవ శ్రీనివాస్ ఆధ్వర్యంలో పరిష్కారానికి చర్యలు చేపడతామని హామీ ఇచ్చి, ఆ తర్వాత యూనియన్ విచ్ఛిన్నానికి ప్రయత్నాలు చేశారని గుర్తు చేశారు. ప్రస్తుత ప్రభుత్వం జర్నలిస్టుల ఇంటి స్థలాలకు నోటిఫికేషన్ ఇచ్చినా సాధారణ ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఇది ఏమేరకు పరిష్కారమవుతుందన్నది చూడాలన్నారు. ఐజేయూ కార్యదర్శి డి.సోమసుందర్, ఐజేయూ సభ్యుడు షేక్ బాబు తదితరులు మాట్లాడారు.

కోడిపందేలపై దాడి.. టీడీపీ నేత అరెస్ట్

నూజివీడు: సుంకొల్లు పరిధిలోని అటవీ ప్రాంతంలో నిర్వహిస్తున్న కోడిపందేలపై ట్రాఫిక్ ఎస్సై శాగం రాధాకృష్ణారెడ్డి తన సిబ్బందితో కలిసి ఆదివారం సాయంత్రం మెరుపుదాడి చేశారు. ఈ దాడిలో సుంకొల్లుకు చెందిన టీడీపీ నాయకుడు రాజగాని లోకేశ్వరరావుతో పాటు మరో ఎనిమిది మందిని పోలీసులు అరెస్టు చేశారు. వీరి నుంచి రూ.10,150 నగదు, నాలుగు కోడి పుంజులను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ కోడిపందేలు, పేకాట వంటి జూదాలను నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

క్లుప్తంగా

భారతమాతను పూజిద్దాం

తాడేపల్లిగూడెం (టీఓసీ): భారతమాతను పూజిద్దామని పలువురు వక్తలు పేర్కొన్నారు. స్థానిక కృష్ణ యోగా ధ్యాన మందిరం ఆధ్వర్యంలో ఆదివారం నగర సంకీర్తన అనంతరం శ్రీకృష్ణ పరమాత్మకు పంచామృతాలతో అభిషేకాలు జరిగాయి. సమరసత ఫౌండేషన్ వారిచే భారతమాత ఔన్నత్యాన్ని, గొప్పతనంను సహనాన్ని భక్తులకు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మందిర కార్యదర్శి ఇందుకూరి మోహన్‌రాజు, సమరసత జిల్లా సంచాలకులు శర్మ, మలపాక సుబ్రహ్మణ్యం, మహిళా సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

గానాల రామ్మూర్తి సేవలు మరువలేనివి

తణుకు టౌన్: విశ్వ బ్రాహ్మణుల ఆర్థిక, సామాజిక అభివృద్ధికి గానాల రామ్మూర్తి ఆచార్యులు చేసిన సేవలు మరువలేమని తణుకు పట్టణ విశ్వ బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు మందారపు నాగ మనోహర్ చెప్పారు. ఆదివారం తణుకు పట్టణ, మండల విశ్వ బ్రాహ్మణ సేవా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన గానాల రామ్మూర్తి ఆచార్యుల 128వ జయంతి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈసందర్భంగా రామ్మూర్తి ఆచార్యుల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో సంఘ ప్రధాన కార్యదర్శి గురజాపు శ్రీనివాసరావు, కోశాధికారి కోరిమిల్లి సుబ్బారావు, కార్యనిర్వాహణా కార్యదర్శి పెదపాటి గోపాల కృష్ణ ప్రసాద్, మందారపు సాయిబాబా, శొంఠ్యాణ లక్ష్మణరావు, నాగమల్లి సాంబశివరావు, తమిరి శ్రీనివాసరావు, పేరూరి పూర్ణాచారి, కర్రి వెంకట సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

మావుళ్లమ్మవారికి బంగారం సమర్పణ

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం పట్టణ ఇలవేల్పు శ్రీమావుళ్లమ్మవారికి మల్లవరం లంక గ్రామానికి చెందిన ఎం.శ్రీనివాసరావు, శేషవేణి దంపతులు నాలుగు గ్రాముల బంగారం సమర్పించుకున్నారు. వారికి ఆలయ సిబ్బంది అమ్మవారి ప్రసాదం, రసీదు అందజేశారు. తొలుత అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

నేడు ఆర్డీఓ కార్యాలయంలో స్పందన

నరసాపురం: స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తామని సబ్‌కలెక్టర్ కార్యాలయ వర్గాలు విలేకరులకు తెలిపాయి. ఉదయం 10.30 గంటల నుంచి ప్రజల నుంచి ఫిర్యాదులు, విజ్ఞప్తులను నరసాపురం ఆర్డీఓ ఎంఏ అంబరీష్ స్వీకరిస్తారు. డివిజన్ స్థాయి అధికారులు అందుబాటులో ఉంటారని, ప్రజలు తమ సమస్యల పరిష్కారానికి దరఖాస్తులు అందించాలని కోరారు.

ఎస్ఈబీ సీఐగా స్వరాజ్యలక్ష్మి

భీమవరం: స్థానిక ఎస్ఈబీ సీఐగా ఇ.స్వరాజ్యలక్ష్మి బాధ్యతలు స్వీకరించారు. విజయవాడ వెస్ట్ స్టేషన్ నుంచి ఆమె బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ విధులు నిర్వహించిన వీవీవీఎస్ఎన్ వర్మ భవానీపురం స్టేషన్‌కు బదిలీ అయ్యారు.

పుష్పరాజ్‌కు దళితరత్న అవార్డు

పెనుగొండ: ఆచంట మండలం ఆచంట వేమవరం గ్రామానికి చెందిన రాష్ట్ర మాల మహానాడు అధ్యక్షుడు నన్నేటి పుష్పరాజ్ దళిత రత్న అవార్డును అందుకున్నారు. ఆదివారం ఏలూరులో గౌతమ బుద్ధ ప్రచార ట్రస్ట్ ఆధ్వర్యంలో రిటైర్డ్ ఐఆర్ఎస్ చాగంటి సంజీవ్ చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. ఈ మేరకు ఆదివారం ఆచంట వేమవరంలో వివరాలు తెలిపారు. కార్యక్రమంలో చైర్మన్ మంచ్ల ఇస్సాక్, దళిత సీనియర్ నాయకులు కాపుదాసి రవికుమార్, మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి నంది జయరాజు, జిల్లా కార్యదర్శి చిల్లే రాజ్‌కుమార్, భీమవరం పట్టణ కార్యదర్శి నేతల సాల్మన్ రాజు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటు దేశానికే గర్వకారణం

నరసాపురం: విజయవాడ నగరంలో సామాజిక న్యాయ మహా శిల్పం పేరుతో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేయడం దేశానికే గర్వ కారణమని షెడ్యూల్‌కులాల సంక్షేమసంఘం నరసాపురం శాఖ అధ్యక్షుడు, రిటైర్డ్ మున్సిపల్ శానిటరీ ఇన్స్‌పెక్టర్ తిర్రే బాబూరావు అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అంబేడ్కర్ మహాశయుడు ఓ కులానికో, ఓ మతానికో ప్రతినిధి కాదన్నారు. సామాజిక న్యాయం కోసం పరితపించారని చెప్పారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత ఎందరో రాజకీయ నేతలు వచ్చారని, ఎన్నో పార్టీలు అధికారంలోకి వచ్చాయని పేర్కొన్నారు. కానీ అంబేడ్కర్ స్ఫూర్తిని, లక్ష్యాలను నెరవేర్చే విధంగా కొందరు నేతలు మాత్రమే పనిచేశారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అంబేడ్కర్ ఆశయ సాధనకు మొదటి నుంచి పనిచేస్తున్నారని చెప్పారు.

ఆదిపరాశక్తి ఆలయానికి తరలిన భక్తులు

ఆకివీడు : ఆదిపరాశక్తి అమ్మవారిని దర్శించుకునేందుకు ఆకివీడు నుంచి తమిళనాడులోని మేల్ మరువత్తూర్‌కు భక్తులు బయలుదేరారు. ఎర్ర వస్త్రాలతో మాల ధరించిన వారు అమ్మవారికి మొక్కు చెల్లించుకునేందుకు ఆదివారం స్థానిక రైల్వే స్టేషన్‌కు చేరుకుని రైలులో బయలుదేరి వెళ్లారు.

గ్రామాల్లో వ్యవసాయ విప్లవం

- ప్రభుత్వ సహాయ, సహకారాలన్నీ గ్రామాల్లోనే
- వేగంగా ఆర్బీకే నిర్మాణ భవనాలు
- రైతులకు అందుబాటులో సేవలు


రైతుల సేవలకు సిద్ధంగా ఉన్న దర్శిపర్రు ఆర్బీకే కేంద్రం


పరిమెళ్లలోని రైతు భరోసా కేంద్రం

పెంటపాడు: పెట్టుబడి సాయంతో పెరిగిన రైతు పరపతి, రైతే రాజు అనేది దశాబ్దాలుగా నెరవేరని నినాదంలా ఉండిపోయింది. కానీ ఉమ్మడి తెలుగు రాష్ట్రంలో దివంగత మహానేత డాక్టర్ వై. ఎస్ రాజశేఖరరెడ్డి నిజంచేసి చూపించారు. అదే ఒరవడిలో నాలుగడుగులు ముందుకు వేసి యావత్తూ మన రాష్ట్రంవైపు చూసేలా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నదాతలకు అండగా నిలుస్తున్నారు. రాష్ట్రంలో ఆయన నేతృత్వంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత రైతు భరోసా పేరుతో రైతులకు పెట్టుబడి సాయం అందిస్తున్నారు. రైతులను వ్యవసాయ శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో వ్యవసాయ సిబ్బందిని, వ్యవసాయ గ్రంథాలను అందుబాటులో ఉంచుతూ రైతుభరోసా కేంద్రాలను ఏర్పాటు చేసారు. ఈ కేంద్రాల ద్వారా విత్తనం నుండి పంట కొనుగోలు వరకు రైతులకు అండగా, ఆసరాగా నిలుస్తున్నారు. వైఎస్సార్ భరోసా కింద ఈ ఏడాదిలో మండలంలో8,500 మంది రైతులకు ఇప్పటివరకు రైతుభరోసా కింద నాలుగు విడతలలో రూ. 53 కోట్లు(సుమారు)అందించారు. యంత్రసేవా పథకంలో భాగంగా 17 గ్రూపులకు రూ. 2 కోట్లు విలువైన యంత్రాలు అందించారు.

గ్రామ స్థాయిలోనే రైతులకు అండగా

గత తెలుగుదేశం ప్రభుత్వంలో ఏ చిన్న అవకాశం వచ్చినా రైతులు మండల కేంద్రం వద్దకు రావాల్సి వచ్చేది. నేడు జగన్‌మోహన్‌రెడ్డి దయవల్ల రైతు భరోసా కేంద్రాల ద్వారా గ్రామ స్థాయిలోనే రైతుల వద్దకు అవసరమైన అన్ని సేవలు వచ్చి పడుతున్నాయి.

మండలంలో 20 ఆర్బీకేలు



పెంటపాడు మండలంలో 20 ఆర్బీకేలు ఉన్నాయి. వీఏఏల ద్వారా సాగులో సూచనలు సలహాలు అందించడంతో పాటు ఈ– క్రాఫ్ నమోదు, పంట నష్టం వస్తే వెంటనే అంచనావేసి ఇన్‌పుట్ సబ్సిడీ అందించేందుకు చర్యలు తీసుకొంటున్నాం. ఆర్బీకేలలో సిబ్బంది రైతులకు అవసరమైన వ్యవసాయ పరిజ్ఞానాన్ని అందించడంతో పాటు, విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు సకాలంలో అందిస్తున్నారు. భూసార పరీక్షలు చేయించడం, పంట బీమా వంటి పనులు చేపడుతున్నారు. పశువుల బీమా, వైద్య సహాయం, సంపూర్ణ దాణా వంటి సేవలు అందజేస్తూ పాడి రైతులకు అండగా నిలుస్తున్నాయి.

– కె. పార్థసారధి, మండల వ్యవసాయాధికారి

మాట నిలుపుకున్నారు



ప్రజా సంకల్పయాత్రలో రైతులకు పెట్టుబడి సాయం అందిస్తామని జగనన్న మాటిచ్చారు. ఆ మాట ప్రకారం గత నాలుగేళ్లుగా ఆర్థిక సాయం అందించారు. ఈ ఏడాది ఖరీఫ్ ప్రారంభానికి ముందుగానే రైతుల ఖాతాలకు జమ చేశారు. రైతుల కష్టాలు తెలుసుకొని సాగుకు పెట్టుబడి సాయం అందిస్తున్నారు. వైఎస్సార్ రైతు భరోసా, పీఎం కిసాన్ కింద ఏటా రైతులకు అందిస్తున్న రూ. 18,000 పెట్టుబడి సాయం ఎంతగానో ఉపయోగపడుతుంది.

– దేవ వెంకటరమణ, రావిపాడు వ్యవసాయ సహకారసంఘ మాజీ చైర్మన్

జగనన్నకు రుణపడి ఉంటాం



అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులకు స్థానిక నాయకుల సహకారంతో లంచానికి తావులేకుండా రైతు ఖాతాల్లో ప్రభుత్వం నష్టపరిహారం కింద అందిస్తున్న సొమ్ములు జమ అవుతున్నాయి. రైతులను కంటికి రెప్పలా కాపాడుతున్నాం అని గత ప్రభుత్వాలు చెప్పాయి కానీ ఆ ప్రభుత్వాన్ని ఇప్పుడే చూస్తున్నాం. నిజంగా రైతు రాజు అనే నానుడి నిజం అవుతుందన్న నమ్మకం ఉంది.

– గన్నిన వెంకట్రావు రైతు, కొండేపాడు

అలరించిన మ్యాజిక్ షో

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని కొబ్బరితోట శ్రీదేవి మహంకాళమ్మ తల్లి 44వ వార్షికోత్సవ జాతర సందర్భంగా 7వ రోజు ఆదివారం రాత్రి తణుకు నవ్య ఈవెంట్స్ వారిచే భారత్, వరల్డ్ రికార్డు, నంది అవార్డు గ్రహీత రాముచే మ్యాజిక్, మిమిక్రీ, మాట్లాడే బొమ్మ కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమాలను ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

నేడు మంత్రి కారుమూరిచే అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు

తణుకు అర్బన్: తణుకు మున్సిపాల్టీ పరిధిలో పూర్తి చేసిన పలు అభివృద్ధి పనులను రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు సోమవారం ప్రారంభించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ బీవీ రమణ తెలిపారు. సీసీ రోడ్లు, డ్రెయినేజీలు, కల్వర్ట్‌లు, రీడింగ్ రూంలు మొత్తం రూ. 4 కోట్లు నిధులతో పూర్తి చేసిన అభివృద్ధి పనులను ఉదయం 9 గంటల నుంచి ప్రారంభోత్సవం మొదలవుతుందని వివరించారు.

నేడు, రేపు 'గూడెం'లో పరిశుద్ధ సమాజ కూడికలు

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం పట్టణంలోని హౌసింగ్‌బోర్డు మాగంటి మినీ ఫంక్షన్ హల్‌లో ఈ నెల 22, 23వ తేదిల్లో పరిశుద్ధ సమాజ కూడికలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు బి.జాన్‌పాల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటలకు, సాయంత్రం 6.30 గంటలకు జరుగుతాయన్నారు. విశ్వాసులు ఈ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

లయన్స్‌క్లబ్ సేవలను విస్తృతం చేస్తాం

తాడేపల్లిగూడెం (టీఓసీ): లయన్స్‌క్లబ్ ఆఫ్ తాడేపల్లిగూడెం సేవలు అభినందనీయమని, క్లబ్ సేవలను మరింతగా విస్తృతం చేస్తామని క్లబ్ రీజియన్ చైర్‌పర్సన్ మదన్‌మోహన్ అగర్వాల్ పేర్కొన్నారు. పట్టణంలోని కడకట్ల జనతా చారిటబుల్ ట్రస్ట్ ఆవరణలో క్లబ్ వారిచే ఆదివారం దాత పదంకుమార్ గుప్తా సాయంతో ఉచిత కంటి వైద్య శిబిరం జరిగింది. ఉపాధ్యక్షుడు గరికపాటి బాపయ్యశర్మ ఆధ్వర్యంలో నిడదవోలు రాజేశ్వరీ రామకృష్ణన్ నేత్ర వైద్యశాల వారిచే 78 మందికి కంటి వైద్య పరీక్షలు జరిగాయి. ఉచిత కంటి ఆపరేషన్‌లు నిమిత్తం 9 మందిని నిడదవోలు పంపారు. 27 మందికి ఉచితంగా కళ్లజోడ్లు వేసేందుకు నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి చిన్నం జగదీష్, కోశాధికారి జీడిగుంట హరిబాబు, ఎల్ఎస్‌వీ నాగేశ్వరరావు, పేరూరి కాశయ్య, సుంకర శ్రీనివాస్, సీహెచ్ వెంకటేశ్వరరావు, పచ్చా మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

వృద్ధులకు ఉచిత వైద్య సేవలు

తణుకు టౌన్: తణుకు సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిషా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో సంచార వైద్యశాల ద్వారా ప్రతి ఆదివారం నిర్వహించే ఉచితవైద్య సేవల కార్యక్రమంలో భాగంగా ఆదివారం 6 మంది వృద్ధులకు ఇళ్ల వద్దకే వెళ్లి వైద్య సేవలందించినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు ఏ కరుణాకర్ చౌదరి తెలిపారు. జనరల్ వైద్యులు సుంకవల్లి నీలు మహేంద్ర తణుకు మండలం వేల్పూరు గ్రామం తదితర ప్రాంతాల్లో పర్యటించి ఇంటి నుంచి నడవలేని వృద్ధుల ఇంటి వద్దకే వెళ్లి 6 మంది వృద్ధులకు వైద్య సేవలు అందించినట్లు తెలిపారు. అసోసియేషన్ సభ్యులు పాతూరి శివన్నారాయణ ఆర్థిక సహాయంతో ఉచితంగా మందులను పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో కోశాధికారి ఆర్జి భాస్కరరావు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

తాడేపల్లిగూడెం రూరల్: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ (రాజమహేంద్రవరం) డాక్టర్ చావన్ శ్యామ్ రాజ్‌నాయక్ అన్నారు. జాతీయ సేవా పథకంలో భాగంగా ఆదివారం మండలంలోని వీరంపాలెం గ్రామంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్యామ్ రాజ్‌నాయక్ మాట్లాడుతూ మొక్కలు నాటడం ద్వారా ఆరోగ్యవంతమైన వాతావరణాన్ని కల్పించుకోవాలన్నారు. అనంతరం గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న గ్రామ సచివాలయం, గ్రామ దేవత, ఆంజనేయస్వామి వార్ల ఆలయాల ఆవరణలో పండ్ల మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్ అమ్మాజీ, డాక్టర్ జి.రమేష్, వ్యవసాయ కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది సురేష్‌రావు, విద్యార్థులు పాల్గొన్నారు.


వీరంపాలెం గ్రామ సచివాలయ ఆవరణలో మొక్కలు నాటుతున్న దృశ్యం

లెనిన్‌కు ఘన నివాళి


తణుకులో లెనిన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు


లెనిన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

తణుకు: పేదరికం లేని సమాజం సృష్టికర్త లెనిన్ అని సీపీఎం పట్టణ కార్యదర్శి పీవీ ప్రతాప్ అన్నారు. తణుకులోని స్థానిక అమర వీరుల భవనం వద్ద ఆదివారం లెనిన్ శత వర్ధంతిని సందర్భంగా ఆయన చిత్రపటానికి ఘనంగా నివాళులు అర్పించారు. మార్క్స్ రచించిన కమ్యూనిస్టు మ్యానిఫెస్టో ఆధారంగా మరో ప్రపంచం సృష్టించారని అన్నారు. అమెరికన్ సామ్రాజ్యానికి ఎదురు నిలబడి పోరాటం చేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు గార రంగారావు, ఎం.గోవిందరాజు, సత్యనారాయణ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సోషలిస్టు సమాజ స్థాపకుడు లెనిన్

తాడేపల్లిగూడెం (టీఓసీ): మానవతావాది, సోషలిస్టు సమాజ స్థాపకుడు లెనిన్ అని పలువురు వక్తలు కొనియాడారు. సీపీఎం పార్టీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో లెనిన్ శత వర్ధంతి సభ స్థానిక పండ్ల మార్కెట్ జట్టు వర్కర్స్ యూనియన్‌లో జవ్వాది శ్రీను అధ్యక్షతన జరిగింది. సీపీఎం పార్టీ పట్టణ కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు, నాయకులు కరెడ్ల రామకృష్ణలు తొలుత లెనిన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లులర్పించారు. లెనిన్ జీవిత విశేషాలను, పోరాటాలను హాజరైన కార్మికులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పుట్టా ఏసు, కోరాడ వెంకటేశ్వరరావు, టి.పెద్దిరాజు, పతివాడ నాగేంద్ర బాబు తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతి, సంప్రదాయాలను కాపాడాలి

భీమవరం అర్బన్: భారతీయ సంస్కృతి సంప్రదాయాలను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని రూరల్ ఎస్సై బి.మోహన్‌రావు, సర్పంచ్ కోళ్ల బాలకృష్ణ అన్నారు. భీమవరం మండలం దిరుసుమర్రు గ్రామంలో సంక్రాంతి సందర్భంగా నిర్వహించిన రంగవల్లుల పోటీల్లో విజేతలకు ఆదివారం బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మోహన్‌రావు, సర్పంచ్ కోళ్ల బాలకృష్ణ మాట్లాడుతూ ఇటువంటి పోటీలు నిర్వహించడం వల్ల బంధుత్వ, స్నేహభావం పెంపొందుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు కేతా నాగబాబు, తేలి జోషఫ్ రవికుమార్, మహిళలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

నేడు మహదేవపట్నంలో పీవీఎల్ పర్యటన

ఉండి: మండలంలోని మహదేవపట్నంలో సోమవారం ఉదయం 9 గంటల నుంచి డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు పర్యటిస్తారని గ్రామ ఉప సర్పంచ్ ముదునూని సుబ్బరాజు తెలిపారు. కార్యక్రమంలో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు నిర్వహిస్తారని తెలిపారు.

23న ఉచిత గుండె వైద్య శిబిరం

భీమవరం (ప్రకాశంచౌక్): బాలల గుండె వ్యాధులకు ఉచిత వైద్య శిబిరంను మంగళవారం ఉదయం మెంటేవారితోటలోని అల్లూరి సీతారామరాజు భగత్‌సింగ్ వైద్య సహాయ కేంద్రం (సుందరయ్య భవనం)లో నిర్వహించనున్నారు. వసుధ ఫౌండేషన్ సహకారంతో విజయవాడ ఆంధ్రా హాస్పిటల్‌కు చెందిన పిల్లల గుండె వైద్య నిపుణులు కె.విక్రమ్ (ఇంటర్ వెన్షనల్ పీడియాట్రిక్ కార్డియాలజిస్ట్) 15 సంవత్సరాలలోపు వయసు ఉన్న పిల్లలను పరిశీలించి, 2డి ఎకో పరీక్షలు నిర్వహించి, ఉచిత వైద్య చికిత్స చేయనున్నారు. ఈ శిబిరాన్ని ప్రజలు వినియోగించుకోవాలన్నారు.

వైఎస్సార్‌సీపీ సమావేశానికి తరలి వెళ్లిన పార్టీ శ్రేణులు

తణుకు టౌన్: ఏలూరులోని క్రాంతి కల్యాణ మండపంలో నిర్వహించిన వైఎస్సార్‌సీపీ ఏలూరు పార్లమెంటరీ జిల్లా విస్తృత స్థాయి సమావేశానికి తణుకు నియోజకవర్గం నుంచి రాష్ట్ర మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ఆధ్వర్యంలో వేలాది మంది పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలి వెళ్లారు. రాష్ట్రమంత్రి కారుమూరి తనయుడు కారుమూరి సునీల్ కుమార్ ఏలూరు పార్లమెంట్ సమన్వయకర్తగా నియమించిన సందర్భంగా ఏర్పాటు చేసిన ఈసమావేశానికి ఆదివారం తణుకు నియోజకవర్గం వ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ పార్టీ నాయకులు, కార్యకర్తలు 400 కార్లు, ఇతర వాహనాల్లో ఏలూరులోని మినీ బైపాస్ వద్ద ఏర్పాటు చేసిన వైఎస్సార్‌సీపీ పార్టీ నాయకులు, కార్యకర్తల సమ్మేళనానికి తరలి వెళ్లారు. ఈకార్యక్రమంలో మూడు మండలాల ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులతో పాటు రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ డైరెక్టర్ మెహర్ అన్సారీ, మండల పార్టీ అధ్యక్షుడు బోడపాటి వీర్రాజు, పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, ఉపాధ్యక్షుడు సుద్దుల పాండు, ఏఎంసీ చైర్మన్ నత్తా కృష్ణవేణి, మాజీ ఏఎంసీ చైర్మన్‌లు చిట్టూరి వెంకట సుబ్బారావు, ఉండవల్లి జానకి, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు ఫణీంద్ర, నాయకులు వెలగల సాయిబాబారెడ్డి, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు జంగం ఆనందకుమార్, మండల రైతు విభాగం అధ్యక్షుడు డీ కృష్ణంరాజు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు.


ఏలూరులో జరిగే వైఎస్సార్‌సీపీ జిల్లా విస్తృత స్థాయి సమావేశానికి తణుకు పట్టణం నుంచి వాహనాల్లో బయలుదేరిన నాయకులు, కార్యకర్తలు

గ్రంథాలయాల సేవలను సద్వినియోగం చేసుకోవాలి

పెంటపాడు: గ్రంథాయల సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ దాసరి హైమావతి, పెంటపాడు సర్పంచ్ తాడేపల్లి సూర్యకళలు పేర్కొన్నారు. ఆదివారం పెంటపాడు నక్కా వెంకటేశ్వరరావు మోమోరియల్ శాఖా గ్రంథాలయంలో చదువరులకు ఉపయోగపడే పుస్తకాలు, పోటీ పరీక్షలకు వెళ్లే విద్యార్థులు అవసరమైన మెటీరియల్‌ను అందించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రంథాలయాల ద్వారా అందించే విజ్ఞానాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థులకు, నిరుద్యోగులకు మంచిగా ఉపయోగపడే పుస్తకాలను గ్రంథాలయాల్లో అందుబాటులో ఉంచిన జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ చీర్ల పద్మశ్రీ రాధయ్యలను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో పెంటపాడు శాఖా గ్రంథాలయాధికారి మహ్మద్ జుల్ఫికర్ అలీ, గూడెం మార్కెట్ యార్డు డైరెక్టర్, పెంటపాడు శాఖా గ్రంథాలయ అధ్యక్షుడు కర్రి వరహాలరెడ్డి, పార్టీ నాయకులు నల్లమిల్లి విజయానందరెడ్డి, డాక్టర్ భాను సత్యనారాయణ పాల్గొన్నారు.


విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న ఎంపీపీ హైమావతి, సర్పంచ్ తాడేపల్లి సూర్యకళ

దివ్యాంగునికి హీరో స్కూటర్ అందజేత


తణుకులో దివ్యాంగ దంపతులకు హీరో స్కూటర్ అందజేస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులు

తణుకు అర్బన్: దివ్యాంగుల సౌకర్యార్థం డాక్టర్ పీఎస్ఎస్ కిరణ్ చారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ అధ్యక్షుడు బొల్లా సతీష్‌కుమార్ అన్నారు. తణుకు రాష్ట్రపతి రోడ్డులోని గమిని ఫిల్లింగ్ స్టేషన్‌లో ఆదివారం పిప్పర గ్రామానికి చెందిన దివ్యాంగ దంపతులు నాయక్, మంగలకు రూ.1.22 లక్షలు విలువైన హీరో స్కూటర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అందజేశారు. ఈ సందర్భంగా సతీష్ కుమార్ మాట్లాడుతూ దివ్యాంగులు తమ అవసరాలను ఫౌండేషన్ దృష్టికి తీసుకువచ్చిన సందర్భంలో వారి అర్హతను బట్టి దాతలను సేకరించి సాయం చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు గమిని రాజా, మానేపల్లి కాశీ విశ్వనాథం, ఎంసీఎస్ కళాశాల అధినేత వేణుగోపాల్, సృష్టి కన్సల్టెంట్ సుబ్బారావు, షర్మిష్ట ఫుడ్స్ అధినేత దీపక్, దువ్వ సింహాద్రి, గూడూరి ఆది, తణుకు జగదీష్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఘనంగా సీతారాముల శోభాయాత్ర


తణుకులో శోభాయాత్ర

తణుకు అర్బన్: అయోధ్య బాల రాముడి విగ్రహ ప్రాణప్రతిష్ట సందర్భంగా తణుకులో ఆదివారం అయోధ్య శ్రీరామ వైభవ యాత్ర ఘనంగా నిర్వహించారు. సమరసత సేవా ఫౌండేషన్, శ్రీసీతారామ కల్యాణ ఆహ్వాన సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలో భాగంగా మేళతాళాలతో, కోలాట భజనల మధ్య సీతారాముల విగ్రహాలతో శోభాయాత్ర స్థానిక వేల్పూరు రోడ్డు నుంచి రాష్ట్రపతి రోడ్డు మీదుగా కన్నుల పండువగా సాగింది. అనంతరం శ్రీచిట్టూరి ఇంద్రయ్య ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడా ప్రాంగణంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపంలో సీతారాముల కల్యాణ ఘట్టం వేదమంత్రాల మధ్య వైభవంగా నిర్వహించారు. భక్తులు వేలాదిగా తరలివచ్చి కల్యాణాన్ని తిలకించారు.


తణుకులో సీతారాముల కల్యాణం

లెనిన్ చూపిన బాటలో ముందుకు సాగాలి


తూర్పు విప్పర్రు లో లెనిన్ చిత్రపటానికి నివాళ్లులర్పిస్తున్న సీపీఐ నాయకులు

ఇరగవరం: మండలంలోని తూర్పు విప్పర్రు గ్రామంలో ఆదివారం సీపీఎం కామ్రేడ్ లెనిన్ శత వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా లెనిన్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళ్లులర్పించారు. అనంతరం సీపీఐ మండల కార్యదర్శి నామాన వేంకటేశ్వరరావు మాట్లాడుతూ లెనిన్ ప్రదర్శించిన విప్లవస్ఫూర్తి, నిరాడంబరత, నిజాయితీ కమ్యూనిస్టులకు ఆదర్శప్రాయమని తెలియజేశారు. లెనిన్ విప్లవస్ఫూర్తితో ఈ దేశంలో విప్లవకారులు ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల సీపీఐ నాయకులు అడ్డాల సత్యనారాయణ, గిద్ద సూర్య నారాయణ, గుడిమెట్ల కోటేశ్వరరావు, కుడిపూడి వెంకట రెడ్డి , కాటూరి రాముడు , మాకినీడి రామ కోటి, ఉడిసి రామోజీ , దాసం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మహిళ మృతిపై ఆందోళన

భీమవరం (ప్రకాశంచౌక్): పాలకోడేరు మండలం విస్సాకోడేరు గ్రామానికి చెందిన ఒక మహిళ (26) అనారోగ్య కారణంగా భీమవరంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి తీసుకురాగా అక్కడ వైద్య సిబ్బంది చేసిన ఇంజెక్షన్ వికటించి మృతి చెందిందని ఆమె బంధువులు ఆదివారం రాత్రి సదరు ఆసుపత్రి వద్ద ఆందోళనకు దిగారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.